అతను.. ఈ నాన్న కొడుకే!

- వివాహేతర సంబంధంతో ఓ కేరళ మహిళకు మగ సంతానం
- ఆ తర్వాత భర్తతో విడాకులు.. భరణం కోసం కోర్టులో కేసు
- తనకు పుట్టని కుమారుడికి తాను డబ్బులు ఇవ్వబోనన్న తండ్రి
- దీంతో పుట్టుకకు కారణమైన తండ్రిని ఆశ్రయించిన కొడుకు
- కుదరదన్న మరో తండ్రి.. డీఎన్ఏ టెస్టుకు పట్టుబట్టిన కొడుకు
- బిడ్డ పుట్టేప్పుడు మహిళకు భర్త ఎవరో అతనే తండ్రి: సుప్రీంకోర్టు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): తన తండ్రి ఎవరో నిజాన్ని బయటపెట్టాలంటే డీఎన్ఏ టెస్టుకు అనుమతించాలంటూ ఓ కొడుకు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. తనకు పుట్టని బిడ్డకు ఆర్థిక సాయం ఎలా చేస్తానంటూ ఆ ఇద్దరు తండ్రులు న్యాయస్థానం ముందు వాపోయారు. పితృత్వం, చట్టబద్ధమైన భావనకు సంబంధించిన 20 ఏండ్ల కిందటి అత్యంత సున్నితమైన ఈ కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం ఎట్టకేలకు కీలక తీర్పు వెలువరించింది.

అసలేమిటీ కేసు?

1989లో కేరళకు చెందిన 23 ఏండ్ల ఓ యువతికి వివాహమైంది. 1991లో కుమార్తె జన్మించింది. 2001లో కుమారుడు పుట్టాడు. అయితే, భర్తతో భేదాభిప్రాయాలు రావడంతో 2003 నుంచి ఆమె అతనికి దూరంగా ఉంటున్నది. 2006లో వీరికి విడాకులు మంజూరయ్యాయి. విడిపోయిన భర్త నుంచి తనకు, తన కొడుక్కి భరణం అందుతున్నది. ఈ క్రమంలో రికార్డుల్లోని తన కుమారుడి తండ్రి పేరును మార్చాలంటూ సదరు మహిళ కొచ్చి మున్సిపల్ కార్పొరేషన్‌లో దరఖాస్తు చేసుకొన్నది. తనకు ఇంకో వ్యక్తితో వివాహేతర సంబంధం ఉండేదని, అతని వల్లే తనకు కొడుకు పుట్టాడని పేర్కొన్నది. అయితే, తండ్రి పేరు మార్పునకు కోర్టు ఆదేశాలు అవసరమని అధికారులు పేర్కొన్నారు. దీంతో ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. డీఎన్ఏ టెస్టు చేయడానికి కింది కోర్టు అంగీకరించింది. కొడుకు తనకు పుట్టలేదని తెలుసుకొన్న చట్టబద్ధమైన తండ్రి.. విడాకులు ఇచ్చిన భార్యకు మాత్రమే భరణం ఇస్తూ.. కుమారుడికి ఇవ్వాల్సిన డబ్బును నిలిపేశాడు.

అక్కడ చుక్కెదురు

డీఎన్ఏ టెస్టు చేయాలన్న కింది కోర్టు ఆదేశాలను మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొన్న వ్యక్తి హైకోర్టులో సవాల్ చేశాడు. ఆమెకు పుట్టిన కొడుక్కి తాను తండ్రి కాదని వాదించాడు. మహిళకు కొడుకు పుట్టేప్పుడు ఆమె, తన భర్తతోనే కలిసి ఉన్నదని, విడాకులు మంజూరు కాలేదని గుర్తు చేశాడు. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 సెక్షన్ 112 ప్రకారం.. వివాహ బంధం కొనసాగే సమయంలో లేదా వివాహబంధం ముగిసిన 280 రోజుల్లోపు పుట్టిన బిడ్డకు చట్టబద్ధంగా ఆ మహిళ భర్తే.. తండ్రిగా వ్యవహరిస్తారన్న నిబంధనలను ఉటంకించాడు. దీంతో తల్లి, కొడుకుల వాదనలను కోర్టు పక్కనబెట్టింది. 2015లో కొడుక్కి ఆరోగ్య సమస్యలు తలెత్తి పలు సర్జరీలు అయ్యాయి. దీంతో తన ఆరోగ్య అవసరాలు, చదువు కోసం తన తండ్రి నుంచి భరణం ఇప్పించాల్సిందిగా కొడుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. దీన్ని వివాహేతర బంధం కలిగిన తండ్రి సవాల్ చేశాడు. వాదనలు విన్న హైకోర్టు.. చట్టబద్ధత అనే విషయాలను పక్కనబెడితే.. కొడుకు పుట్టుకకు కారణమైన తండ్రే డబ్బు సాయం చేయాలంటూ 2018లో తీర్పునిచ్చింది. దీంతో వివాహేతర బంధం కలిగిన తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

సుప్రీంలో వాదనలు ఇలా..

తన పుట్టుక సమయంలో తన తల్లిదండ్రులు వేర్వేరుగా ఉంటున్నట్టు పిటిషనర్ అయిన కొడుకు నిరూపించలేకపోయాడని వివాహేతర బంధం కలిగిన వ్యక్తి తరుపు న్యాయవాది వాదించాడు. దీంతో డీఎన్ఏ టెస్ట్, భరణాన్ని ఏ హక్కుతోనూ అతను కోరలేడని పేర్కొన్నాడు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకొన్న సుప్రీంకోర్టు.. డీఎన్ఏ టెస్టు చేయడాన్ని తోసిపుచ్చింది. సరైన ఆధారాలు లేకుండా డీఎన్ఏ టెస్టు పేరిట ఓ వ్యక్తి గోప్యతకు భంగం కలిగించలేమని పేర్కొంది. ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్, 1872 సెక్షన్ 112 ప్రకారం.. కొడుకు జన్మించినప్పుడు ఎవరైతే ఆ భార్యకు భర్తగా ఉంటారో.. అతనే ఆ కొడుక్కి చట్టబద్ధమైన తండ్రి అంటూ తీర్పునిచ్చింది.

షేక్ చేస్తున్న 'డీప్‌సీక్'

- కృత్రిమ మేధ రంగంలో కొత్త సంచలనాలు
- ఓపెన్‌ఏఐ, గూగుల్, మైక్రోసాఫ్ట్‌కు చాలెంజ్
- 51 లక్షల కోట్లను ఆవిరి చేసిన 51 కోట్ల యాప్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జనవరి 28 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో చైనా కంపెనీ డీప్‌సీక్ అభివృద్ధి చేసిన ఏఐ టూల్ 'డీప్‌సీక్ ఆర్1' పెను సంచలనాలను సృష్టిస్తున్నది. ఓపెన్ ఏఐకు చెందిన చాట్‌జీపీటీ, గూగుల్‌కు చెందిన జెమినీ, మైక్రోసాఫ్ట్ అభివృద్ధి చేసిన అజూరా, కోపైలట్‌ను తోసిరాజని 'డీప్‌సీక్' కొత్త రికార్డులు సృష్టిస్తున్నది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం 'డీప్‌సీక్ ఆర్1' టూల్‌ని ఉద్దేశిస్తూ.. అమెరికన్ టెక్ కంపెనీలకు ఇదో మేల్కొలుపు అంటూ వ్యాఖ్యానించారంటే ఇది ఏ స్థాయిలో సంచలనాలను సృష్టిస్తున్నదో అర్థంచేసుకోవచ్చు.

ఏమిటీ 'డీప్‌సీక్ ఆర్1'?

'డీప్‌సీక్ ఆర్1' అనేది చాట్‌జీపీటీ లాంటి ఏఐ ఆధారిత చాట్‌బాట్. వినియోగదారులు అడిగే ప్రశ్నలకు కచ్చితమైన సమాధానాలు ఇవ్వడానికి సాయపడుతుంది. చాట్‌జీపీటీ లాగే ఆర్1 మోడల్‌పై ఇది పనిచేస్తుంది. అంటే 670 బిలియన్ పారామీటర్లు కలిగి ఉన్న అతిపెద్ద లాంగ్వేజ్, డాటాను ఇది నిక్షిప్తం చేసుకొని సేవలు అందిస్తుందన్న మాట. ఏ ప్రశ్న అడిగినప్పటికీ సమాధానమివ్వగల సామర్థ్యం దీని సొంతం.

ఎందుకంత ప్రత్యేకం?

చాట్‌జీపీటీ, గూగుల్ జెమినీ చాట్‌బాట్‌తో పోలిస్తే ప్రతీఒక్కరూ డీప్‌సీక్‌కు ఆకర్షితులు కావడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి దీని తయారీకి ఖర్చుయిన సొమ్ము మిగతా చాట్‌బాట్‌లపై చేసిన వ్యయంలో 50 రెట్లు తక్కువగా ఉన్నట్టు చెప్పున్నారు. డీప్‌సీక్ మోడల్‌కు శిక్షణ ఇచ్చేందుకు తక్కువ సామర్థ్యం కలిగిన ఎన్విడియా హెచ్ 800 చిప్‌లను వాడారు. దీంతో యాప్ తయారీ, సేవల వ్యయం భారీగా తగ్గిపోయింది. మిగతా చాట్‌బాట్‌లు యూజర్ల నుంచి సబ్‌స్క్రిప్షన్ల పేరిట కొంత రుసుమును వసూలు చేస్తుండగా 'డీప్‌సీక్' యాప్ ఫ్రీగా అందుబాటులోకి వచ్చింది. యాపిల్ యాప్ స్టోర్ నుంచి అతి తక్కువ కాలంలో అత్యధిక డౌన్‌లోడ్‌లు సాధించిన యాప్‌గా 'డీప్‌సీక్' నిలిచింది. చైనాకు చెందిన ఐటీ ఇంజినీర్ లియాంగ్ వెన్‌ఫెంగ్ 'డీప్‌సీక్' సంస్థకు వ్యవస్థాపకుడిగా ఉన్నారు.

ప్రముఖుల ప్రశంసలు

డీప్‌సీక్‌పై పలువురు ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'డీప్‌సీక్ ఆవిష్కరించిన ఆర్1 మోడల్ ఆకట్టుకొంటున్నది. తక్కువ ధరకు ఈ సేవలు ఇవ్వడం విశేషం. త్వరలోనే మేమూ మెరుగైన మోడల్ తీసుకొస్తాం' అని ఓపెన్‌ఏఐ సీఈవో శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. 'డీప్‌సీక్' ఓ మేల్కొలుపు అంటూ అమెరికన్ టెక్ కంపెనీలను ట్రంప్ సున్నితంగా హెచ్చరించారు. 'డీప్‌సీక్' పనితీరును ఎన్‌వీడియా సంస్థ కూడా ప్రశంసించింది.

పరిమితులూ ఉన్నాయ్

'డీప్‌సీక్' చాట్‌బాట్‌లో చైనాకు వ్యతిరేకమైన విషయాలను అడిగితే సమాధానం రావట్లేదని నెటిజన్లు అంటున్నారు. 'అరుణాచల్ భారత్‌లోని ఓ రాష్ట్రం' అని టైప్ చేస్తే.. 'ఇది నా పరిధి దాటిన అంశం. మరేదైనా చర్చిద్దాం' అంటూ డీప్‌సీక్ సమాధానమిచ్చినట్టు ఓ యూజర్ అన్నారు. 1989 జూన్ 4న చైనాలోని తియాన్మెన్ స్క్వేర్‌లో జరిగిన ఊచకోతపై ప్రశ్నించగా.. 'ఐయామ్ సారీ.. సమాధానం ఇవ్వలేను' అని వచ్చినట్టు మరో నెటిజన్ పేర్కొన్నారు.

దెబ్బ మామూలుగా లేదు

అడ్వాన్స్‌డ్ ఏఐకి ఖరీదైన చిప్స్, అలాగే భారీ పెట్టుబడులు అవసరం లేదని డీప్‌సీక్ యాప్ విజయమే చాటిచెబుతున్నదన్న వాదనలు పెరుగుతున్నాయి. అందుకే, ఖరీదైన చిప్ తయారీ దిగ్గజ సంస్థ ఎన్‌వీడియా సంస్థ సోమవారం ఒక్కరోజే రూ. 51 లక్షల కోట్లను నష్టపోయింది. కాగా 'డీప్‌సీక్ ఆర్1' తయారీకి రూ. 51 కోట్లు ఖర్చవ్వడం గమనార్హం.

వాట్సాప్‌లో నోటీసులు చెల్లవు

- ఈ-మెయిల్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ మాధ్యమాల్లోనూ పంపరాదు
- పోలీసులకు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ: నేర శిక్షా స్మృతి లేదా భారతీయ నాగరిక సురక్ష సంహిత ప్రకారం నిందితులకు పోలీసులు ఇవ్వవలసిన నోటీసులను వాట్సాప్, ఈ-మెయిల్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో పంపించారాదని సుప్రీంకోర్టు చెప్పింది. సీఆర్‌పీసీ, 1973లోని సెక్షన్ 41-ఏ లేదా బీఎన్ఎస్ఎస్, 2023లోని సెక్షన్ 35 ప్రకారం జారీ చేసే నోటీసులను చట్టం అనుమతించినట్లుగానే నిందితులకు అందజేయాలని పోలీసులను ఆదేశించాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. సతేందర్ కుమార్ అంటిల్ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ రాజేశ్ బిందల్ ధర్మాసనం ఈ నెల 21న ఈ ఆదేశాలను జారీ చేసింది. సీఆర్‌పీసీ, 1973లోని సెక్షన్ 41-ఏ ప్రకారం నిందితులకు నోటీసులను వాట్సాప్ ద్వారా పంపించినపుడు, ఆ నిందితులు దర్యాప్తు అధికారి సమక్షంలో హాజరుకాని సందర్భాలు ఉన్నాయని అమికస్ క్యూరీ సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు. సాధారణ పద్ధతిలో నోటీసులను అందజేయడానికి బదులుగా, సీఆర్‌పీసీ సెక్షన్ 41-ఏ లేదా బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35 నిర్దేశించిన విధానాన్ని పోలీసులు దాటవేయరాదని చెప్పారు. దీంతో ధర్మాసనం స్పందిస్తూ, నిందితులకు నోటీసులను అందజేయడానికి సీఆర్‌పీసీ/బీఎన్ఎస్ఎస్ నిర్దేశించిన, గుర్తించిన విధానం ఉందని, వాట్సాప్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతుల్లో నోటీసులను పంపించడం ఆ విధానానికి ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది.

మూడు వారాల్లోగా అమలుచేయాలి..

అన్ని హైకోర్టులు సంబంధిత కమిటీల సమావేశాలను నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. తన అన్ని ఆదేశాలు, అన్ని స్థాయిల్లోనూ అమలయ్యేలా నెలవారీ ప్రాతిపదికపై చర్యలు తీసుకోవాలని తెలిపింది. ఈ ఆదేశాలను పాటించినట్లు తెలిపే నివేదికలను నెలవారీ సమర్పించాలని తెలిపింది. ఈ ఆదేశాలు మూడు వారాల్లోగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాలు, యూటీల హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్స్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది.

అత్యంత ధనిక పార్టీగా బీజేపీ

ఏకంగా రూ.7,113 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్

న్యూఢిల్లీ: కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న బీజేపీ అత్యంత ధనిక పార్టీగా నిలిచింది. ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా చెప్పుకుంటున్న బీజేపీ నిరుడు మార్చి 31 నాటికి ఏకంగా రూ.7,113.80 కోట్ల బ్యాంక్ బ్యాలెన్స్‌ను కలిగి ఉండగా.. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వద్ద రూ.857.15 కోట్ల నిధులు ఉన్నాయి. ఈ విషయాలను ఆయా పార్టీలే ఎన్నికల కమిషన్‌కు నివేదించాయి. ఆ లెక్కల ప్రకారం.. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో బీజేపీ రూ.1,754.06 కోట్లు ఖర్చు చేసింది. ఇది 2022-23లో ఖర్చు చేసిన రూ.1,092 కోట్ల కంటే 60% అధికం. కాంగ్రెస్ పార్టీ ఖర్చు 2023-24లో రూ.619.67 కోట్లకు పెరిగింది.

సెక్యులర్ చట్టం కోసం ముస్లిం మహిళ పిటిషన్

ఆస్తి పంపకాలకు షరియా వర్తింపజేయాలని అభ్యర్థన

న్యూఢిల్లీ : తన ఆస్తిని పూర్తిగా తన కుమార్తెకు ఇవ్వడానికి భారతీయ వారసత్వ చట్టాన్ని అనుసరించేందుకు అనుమతి ఇవ్వాలని కేరళ మహిళ సఫియా సుప్రీంకోర్టును మంగళవారం కోరారు. తనకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారని; కుమారుడు ఆటిజంతో బాధపడుతున్నాడని చెప్పారు. అతని సంరక్షణ బాధ్యతలను తన కుమార్తె చూసుకుంటున్నదని తెలిపారు. తన కుమారుడు డౌన్ సిండ్రోమ్ వల్ల మరణిస్తే, షరియా ప్రకారం కుమార్తెకు తన ఆస్తిలో మూడో వంతు మాత్రమే వస్తుందని, ఈ నేపథ్యంలో తన ఆస్తి పంపకాల కోసం భారతీయ వారసత్వ చట్టాన్ని అనుసరించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

యమునపై పొలిటికల్ వార్

- నీటిలో విషం కలుపుతున్నారని హర్యానాపై ఆప్ తీవ్ర ఆరోపణ
- పరువునష్టం దావా వేస్తామని హర్యానా సీఎం హెచ్చరిక

న్యూఢిల్లీ, జనవరి 28: బీజేపీ అధికారంలో ఉన్న హర్యానా ప్రభుత్వంపై ఆప్ నేతలు తీవ్ర ఆరోపణలు చేశారు. హర్యానా ప్రభుత్వం తమకు సరఫరా చేస్తున్న నీటిలో విషం కలుపుతున్నదని, దీని కారణంగా రాజధానిలో సామూహిక మరణాల ప్రమాదం ఉందని సోమవారం మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్ ఆరోపించారు. దీని కారణంగా ఢిల్లీలోని కొన్ని ప్రాంతాలకు ఆ కలుషిత నీటి సరఫరాను నిలిపివేయాల్సిన పరిస్థితి రావచ్చునని చెప్పారు. ఈ ఆరోపణలను తిరస్కరించిన హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ఎంపీ ధరంవీర్ సింగ్, ఇతర ఎంపీలు వారిపై మండిపడ్డారు. తమ గౌరవానికి భంగం కలిగించేలా ఆరోపణలు చేస్తున్న అరవింద్ కేజ్రీవాల్‌పై పరువునష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ ఆరోపణలు హర్యానా ప్రజల మనోభావాలను దెబ్బతీశాయని ధరంవీర్ సింగ్ తెలిపారు.

మీ ఆరోపణలపై ఆధారాలు చూపండి:ఈసీ

కేజ్రీవాల్ చేసిన ఆరోపణలు రుజువు చేసే వాస్తవిక ఆధారాలను చూపాలని భారత ఎన్నికల సంఘం ఆయనను కోరింది. యమునా నీటిని విషపూరితంగా మార్చే రసాయనాల స్వభావం, వాటి వివరాలను బుధవారం రాత్రి 8 గంటల్లోగా తమకు సమర్పించాలని ఒక లేఖలో ఆదేశించింది.

పని కన్నా కుటుంబమే ముఖ్యం

78% భారతీయ ఉద్యోగుల మనోగతం

న్యూఢిల్లీ, జనవరి 28: ఉద్యోగం, వ్యక్తిగత జీవితం మధ్య సమతూకం ఉండాలని ఒక పక్క, వారానికి 90 గంటల పని వేళలు ఉండాలని ఎల్ అండ్ టీ చైర్మన్ చేసిన సిఫార్సులపై మరో పక్క జోరుగా చర్చ సాగుతున్న నేపథ్యంలో ఉద్యోగానికన్నా తాము కుటుంబానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని 78 శాతం మంది భారతీయ ఉద్యోగులు ఓ సర్వేలో వెల్లడించారు. భారతీయ ఉద్యోగుల వైఖరిలో గణనీయమైన మార్పు వచ్చిందని గ్లోబల్ జాబ్ సైట్ ఇండీడ్ చేసిన తాజా సర్వే నివేదిక పేర్కొంది. ప్రతి ఐదుగురిలో నలుగురు(78శాతం) కెరీర్‌లో ఎదుగడం కన్నా తమ భార్య, పిల్లలు, తల్లిదండ్రులతో ఎక్కువ సమయం గడపడానికే ప్రాధాన్యత ఇస్తామని చెప్పినట్టు నివేదిక తెలిపింది. మంచి జీతం ఉన్న ఉద్యోగంతో పాటు తక్కువ ఒత్తిడి, మానసిక ఆరోగ్యంపై ఎక్కువ శ్రద్ధ చూపే ఉద్యోగాలనే అధిక శాతం మంది కోరుకుటున్నట్టు ఈ సర్వే పేర్కొంది.

సెంచరీకి చేరువైన ఇస్రో

చారిత్రక వందో మిషన్‌కు కౌంట్‌డౌన్ షురూ

నేటి ఉదయం నింగిలోకి జీఎస్ఎల్వీ ఎఫ్ 15

శ్రీహరికోట, జనవరి 28: బుడి బుడి అడుగులతో రోదసి ప్రస్థానం ప్రారంభించిన మన ఇస్రో నేడు 'రాకెట్' వేగంతో దూసుకెళుతూ అగ్ర దేశాల సరసన తన స్థానాన్ని సుస్థిరం చేసుకొంటున్నది! ఇందులో భాగంగా చారిత్రక వందో ప్రయోగానికి సర్వ సన్నద్ధమైంది. ఈ ప్రయోగానికి సంబంధించిన 27 గంటల కౌంట్‌డౌన్ మంగళవారం శ్రీహరికోటలో మొదలైంది.బుధవారం ఉదయం 6.23 గంటలకు దేశీయ క్రయోజెనిక్ ఉన్నత శ్రేణి వ్యోమ నౌక జీఎస్ఎల్వీ రాకెట్-15.. ఎన్‌వీఎస్-02 ఉపగ్రహాన్ని రోదసిలోకి తీసుకెళ్లనుంది. భారత నావిగేషన్ వ్యవస్థ నావిక్ సిరీస్‌లోని ఈ రెండో ఉపగ్రహం కచ్చితమైన పొజిషన్, వేగం, టైమింగ్‌తో భారత ఉపఖండం అవతల 1500 కి.మీ పరిధి వరకు యూజర్లకు కచ్చితమైన గమన సూచనలు(నావిగేషన్, ముఖ్యంగా నౌకాయానం) అందిస్తుంది. 50.9 మీటర్ల పొడవైన రాకెట్ జీఎస్ఎల్వీ-ఎఫ్12 మిషన్‌లో ఎన్‌వీఎస్-01 ఉపగ్రహాన్ని గతేడాది మే 29 విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టింది. నేడు నింగిలోకి దూసుకెళ్లనున్న 2,250 కిలోల బరువైన ఎన్‌వీఎస్-02 శాటిలైట్‌ను యూఆర్ శాటిలైట్ కేంద్రంలో రూపొందించి అభివృద్ధి పరిచారు. ఇందులో రేజింగ్ పేలోడ్‌కు అదనంగా ఎల్1, ఎల్5 నావిగేషన్ పేలోడ్లు ఉన్నాయి. ఈ ఉపగ్రహం అందించే నావిగేషన్ సమాచారాన్ని గగనతల, భూతల, జల మార్గాల్లో ఉపయోగించుకోవచ్చు. విమానాల నిర్వహణకు, మొబైల్స్‌లో స్థాన ఆధారిత సేవలకు, ఉపగ్రహాల కక్ష్య నిర్ధారణకు, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత అప్లికేషన్లకు, ఈ ఉపగ్రహపు నావిగేషన్‌ను వాడుకోవచ్చని ఇస్రో తెలిపింది.

46 ఏండ్లలో 99 ప్రయోగాలు..

భారత్ తన మొదటి పెద్ద ఉపగ్రహాన్ని 1970, ఆగస్టు 10న శ్రీహరికోట నుంచి ప్రయోగించింది. ఇస్రో 99 ప్రయోగాలు చేయడానికి 46 ఏండ్ల సుదీర్ఘ కాలం పట్టింది. ఇప్పటివరకు ఇస్రో సాధించిన ప్రగతి వెనుక పలు తరాల శాస్త్రవేత్తల కృషి ఉన్నదని సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం సంచాలకులు రాజరాజన్ మంగళవారం మీడియాకు తెలిపారు.

లడ్డూ మహోత్సవంలో కూలిన వేదిక

- ఏడుగురు దుర్మరణం
- 75 మందికి గాయాలు
- ఉత్తరప్రదేశ్‌లో ఘటన

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని బదౌత్ పట్టణంలో మంగళవారం జరిగిన లడ్డూ మహోత్సవంలో విషాదం చోటు చేసుకుంది. వెదురుతో నిర్మించిన వేదిక కూలడంతో ఏడుగురు చనిపోగా, 75 మంది గాయపడ్డారు. పట్టణంలోని దిగంబర్ జైన్ కళాశాల మైదానంలో ఉదయం భగవాన్ ఆదినాథ్‌కు అభిషేకం కోసం జైనులు లడ్డూ మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదిక పైకి ఎక్కే మెట్లు విరగడంతో మొత్తం వేదిక కుప్పకూలింది. దీంతో వేదిక మీద ఉన్న వారంతా కింద పడ్డారు. అంబులెన్స్ సకాలంలో ఘటనా స్థలికి చేరుకోలేకపోవడంతో ఆటో రిక్షాల్లో క్షతగాత్రులను సమీప దవాఖానలకు తరలించారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది.

కర్ణాటకలో నీటి చార్జీల బాదుడు

సిద్ధమవుతున్న కాంగ్రెస్ సర్కార్

బెంగళూరు, జనవరి 28: కర్ణాటక ప్రజలపై మరో బాదుడుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవుతున్నది. బెంగళూరు వాటర్ బోర్డు ప్రతి ఏడాది వెయ్యి కోట్ల నష్టాన్ని ఎదుర్కొంటున్నదని, ఈ క్రమంలో నీటి చార్జీల పెంపు తప్పనిసరని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అన్నారు. అధికారులతో సమావేశమైన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ నీటి చార్జీల పెంపుపై ఒక నివేదిక తయారు చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించినట్టు చెప్పారు. నీటి చార్జీల పెంపుపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. అలాగే నీటి సరఫరా సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2014 నుంచి నీటి చార్జీలు పెంచలేదని, దాని కారణంగా బోర్డు ఏడాదికి వెయ్యి కోట్ల నష్టాన్ని ఎదుర్కొంటున్నదని అన్నారు. విస్తృత చర్చల అనంతరమే నీటి చార్జీల పెంపు ఎంత అన్నదానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. గతంలో తాము అధికారంలో ఉన్నప్పుడు మురికివాడలో నివసిస్తున్న పేదలకు నీటి సరఫరా కోసం 20 కోట్లను కేటాయించామని, అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన బీజేపీ దానిని నిలిపివేసిందని ఆరోపించారు.

అమెరికాలో ఆదాయపు పన్ను రద్దు?

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ ప్రజల నుంచి వసూలు చేస్తున్న ఆదాయపు పన్నును రద్దు చేయాలని సోమవారం ప్రతిపాదించారు. ఐటీ రద్దు చేస్తే అది వ్యక్తులకు, కుటుంబాలకు భర్చు చేయగల ఆదాయాన్ని పెంచుతుందని ఆయన భావిస్తున్నారు. ఇది పాత అమెరికన్ పద్ధతులను తిరిగి తేవడమే కాక, దేశ సంపద పెరుగుతుందని, అమెరికాను సుసంపన్న దేశంగా చేస్తుందని, మునుపెన్నడూ లేనంతా పటిష్ఠవంతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. అయితే ఆదాయపు పన్ను రద్దు ద్వారా వచ్చే లోటును దిగుమతుల సుంకాల ద్వారా భర్తీ చేయాలనుకుంటున్నట్టు చెప్పారు. మరోవైపు భారత్, చైనా, బ్రెజిల్ దేశాలపై అత్యధిక పన్నులు విధిస్తామని ట్రంప్ చెప్పారు. ఆ దేశాలను అత్యధిక సుంకాలు విధించే దేశాలుగా పేర్కొన్న ఆయన, అమెరికాకు హాని కలిగించే దేశాలపై సుంకాలను తప్పక విధిస్తామని చెప్పారు.

రెండు మగ ఎలుకలతో సంతానోత్పత్తి!

న్యూఢిల్లీ: వైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిశోధకులు రెండు మగ ఎలుకలను ఉపయోగించి, సంతానాన్ని ఉత్పత్తి చేయడం మాత్రమే కాకుండా, ఆ సంతానం ఎక్కువ కాలం జీవించేలా చేయగలిగారు. స్టెమ్ సెల్ రీసెర్చ్, పునరుత్పాదక వైద్య రంగంలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఈ అధ్యయన నివేదిక 'సెల్ స్టెమ్ సెల్' జర్నల్‌లో ప్రచురితమైంది. పాలిచ్చే జంతువుల్లో ఒకే జాతి జంతువులను ఉపయోగించి సంతానోత్పత్తి చేయడంలో గతంలో అనేక సమస్యలు ఉత్పన్నమయ్యేవి. వాటిని ప్రస్తుత పరిశోధన అధిగమించగలిగింది. జీన్ ఎడిట్స్ వల్ల ఎక్కువ కాలం జీవించే బై-ప్యాటర్నల్ యానిమల్స్‌ను సృష్టించగలిగినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ విధంగా రూపొందిన స్టెమ్ సెల్స్‌కు మరింత ఎక్కువ స్థిరమైన ప్లురిపొటెన్సీ ఉన్నట్లు గుర్తించామన్నారు. శరీరంలో ఏదైనా సెల్ లేదా టిష్యూగా మారగలిగే వాటినే ప్లురిపొటెంట్ స్టెమ్ సెల్స్ అంటారని చెప్పారు. పునరుత్పాదక వైద్య రంగంలో మరింత అభివృద్ధికి తమ పరిశోధన బాటలు పరుస్తుందని తెలిపారు. ఈ పరిశోధన ఫలితాల ఆధారంగా కోతులు వంటి పెద్ద జంతువుల్లో కూడా సంతానోత్పత్తి చేయడానికి ప్రయత్నిస్తామన్నారు. జపాన్‌లోని క్యుషు, ఒసాకా విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తలు కూడా రెండు మగ ఎలుకలను ఉపయోగించి సంతానోత్పత్తి చేయగలిగారు. ఒక మగ ఎలుక చర్మ కణాలను మూల కణాలుగా మార్చారు. అనంతరం వాటిలోని 'వై' క్రోమోజోములను తొలగించి, వాటి స్థానంలో 'ఎక్స్' క్రోమోజోములను ప్రవేశపెట్టారు. వాటిని అండాలుగా తయారయ్యేలా చేశారు. వేరొక మగ ఎలుక వీర్యంతో ఫలదీకరణం చెందించారు. ఫలితంగా 600 పిండాలు ఏర్పడ్డాయి. వాటిని సరోగేట్ ఎలుకలో ప్రవేశపెట్టారు. ఆ ఎలుక ఏడు పిల్లలకు జన్మనిచ్చింది.

పులి మూత్రం పావులీటర్ 600!

బీజింగ్, జనవరి 28: చైనాలోని ఓ జూ పులుల మూత్రంతో సొమ్ము చేసుకొంటోంది! వాటి మూత్రం కీళ్ల వాతం చికిత్సకు ఉపయోగపడుతుందని ప్రచారం చేస్తున్నది. దీనిపై వైద్యులు, నెటిజన్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చైనా మీడియా కథనం ప్రకారం సిచ్యూన్ ప్రావిన్స్‌లోని ది యాన్ బైఫెంగ్సియా వన్య ప్రాణి జంతు ప్రదర్శన శాల సైబీరియన్ పులుల మూత్రం సేకరించి పావు లీటర్ సీసాను రూ.600కు అమ్ముతున్నది. కీళ్ల వాతం, బెణుకులు, కండరాల నొప్పులకు ఈ పులుల మూత్రం ఔషధంగా పని చేస్తుందని ప్రచారం చేస్తున్నది. అయితే పులి మూత్రం పనితీరుని నిర్ధారించకోకుండా ఇలా ఔషధం పేరుతో అమ్మడంపై చైనా సంప్రదాయ వైద్యుడొకరు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంటల్లో విమానం

నెల రోజుల్లోనే దక్షిణకొరియాలో రెండో ప్రమాదం

176 మంది సురక్షితం

సియోల్: నెలరోజుల వ్యవధిలో దక్షిణ కొరియాలో మరో ప్రయాణికుల విమానం ప్రమాదానికి గురైంది. మంగళవారం రాత్రి గిమ్హే అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి హాంకాంగ్‌కు బయల్దేరడానికి సిద్ధమవుతున్న ఎయిర్ బస్ మంటల్లో చిక్కుకుంది. విమానంలోని